సాక్షి
పల్నాడు

ఆదివారం । 17 । నవంబర్ । 2024




నిదానంపాటి అమ్మవారి తిరునాళ్ల

శావల్యాపురం: శావల్యాపురంలోని నిదానంపాటి అమ్మవారి తిరునాళ్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణానికి కోటపాటి మృత్యుంజయుడు, లక్ష్మీ పార్వతి దంపతులు రూ.1,01,116 అందజేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 4513 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 2460 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



అమరావతి: ప్రముఖ శైవ క్షేత్రమైన అమరావతిలోని శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుడిని హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అధికారులు అర్చకులు జస్టిస్ మల్లికార్జునరావు దంపతులకు స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం జస్టిస్ మల్లికార్జునరావు దంపతులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సునీల్‌కుమార్, స్థానిక అధికారులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్య ఎదుగుదల అందరి బాధ్యత

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



నరసరావుపేటఈస్ట్: బాలల శారీరకంగా, మానసికంగా సంపూర్ణంగా ఎదిగేందుకు అవసరమైన సహకారం అందించటం అధికారుల బాధ్యత అని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. 6 నెలల వయస్సు చిన్నారి నుంచి 15 సంవత్సరాలు వచ్చే వరకు పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రకాష్‌నగర్‌లోని శ్రీ తిలక్ మున్సిపల్ పాఠశాలలో శనివారం రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కె) ద్వారా చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరేళ్ల వయస్సు దాటిన పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ, 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠశాలల్లోనూ ఎప్పటికప్పుడు హెల్త్ స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే పోషకాహారాన్ని విద్యార్థులు నిర్లక్ష్యం చేయవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, ఆర్‌బీఎస్‌కె పీఓ రాజరాజేశ్వరి, ఆర్డీఓ మధులత, తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

నేటి నుంచి వ్యవసాయ కళాశాల్లో పలు పోటీలు

బాపట్ల: 2024–25 వార్షిక రెండో దశ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఆదివారం నుంచి ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ కళాశాలలో ప్రారంభం కానున్నాయని డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ జి. కరుణా సాగర్ తెలిపారు. 20వ తేదీ వరకు జరిగే పోటీల్లో విశ్వవిద్యాలయానికి చెందిన 19 అనుబంధ కళాశాలలకు చెందిన 612 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థినులకు ప్రత్యేకంగా క్రీడా పోటీల్ని కళాశాల ప్రాంగణంలోనే నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు స్పోర్ట్స్ పెవిలియన్ వద్ద నిర్వహించనున్న ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆర్.శారదా జయలక్ష్మీదేవి, గౌరవ అతిథిగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గుంటూరు డెప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.జవహర్‌పాల్గొంటున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూనారాణి తెలిపారు. విస్తరణ విభాగాధిపతి ఎం.సురేష్ కుమార్, ఎం.రమాదేవి, టి. ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

సమయపాలనతో ప్రయాణికుల్లో భరోసా

ఆర్టీసీ డెప్యూటీ సీటీఎం షమీమ్

అద్దంకి: సమయపాలనతో ప్రయాణికుల్లో ఆర్టీసీపై భరోసా కల్పించవచ్చని నెల్లూరు డివిజన్ ఆర్టీసీ డెప్యూటీ సీటీఎం షమీమ్ తెలిపారు. ఆమె శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోను సందర్శించారు. అనంతరం కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రయాణికులకు ఆర్టీసీపై నమ్మకం ఏర్పడితే ఓఆర్ పెంచుకోవచ్చని చెప్పారు. డ్యూటీలో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లు అరగంట ముందు వచ్చి బస్‌ను చెక్ చేసుకోవాలని, స్టాప్‌లో పావు గంట ముందుగానే పెట్టాలని తెలిపారు. సరైన సమయానికి బస్సును నడపాలని చెప్పారు. కేఎంపీఎల్ అధికంగా తెచ్చినవారికి, అత్యధిక ఆదాయం తెచ్చిన సిబ్బందికి బహుమతులు పంపిణీ చేశారు. అద్దె బస్సుల సిబ్బందికి కూడా శిక్షణ ఉంటుందని, ఆయా బస్ డ్రైవర్లను శిక్షణకు పంపాలని సూచించారు. డిపో మేనేజర్ బి. రామమోహనరావు పాల్గొన్నారు.

'ఏం కొనేటట్టులేదు..ఏం తినేటట్టులేదు'.. అనే చందంగా తయారైంది పరిస్థితి. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రోజంతా కష్టపడి సంపాదించిన డబ్బుతో బజారుకెళితే జేబులు ఖాళీ అవుతున్నాయి. కనీసం పచ్చడి మెతుకులు తిందామన్నా కష్టంగా తయారైంది. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ధరల నియంత్రణలో పట్టీపట్టనట్లుగా ఉంది.



దడ పుట్టిస్తున్న ధరలు

- అమాంతంగా పెరిగిన ఉల్లి, వెల్లుల్లి, కొబ్బరి కాయలు
- పేద, మధ్యతరగతి సామాన్యులకు తప్పని అవస్థలు
- మున్నాళ్ల ముచ్చటగా మారిన ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాల్స్
- ధరల నియంత్రణలో చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం

సత్తెనపల్లి: నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు మండుతున్నాయి. సామాన్యుడు కొనలేని పరిస్థితి. రూ.500 తీసుకెళితే కనీసం సంచి సగానికి కూడా రావడం లేదు. ధరలు అమాంతం పెరుగుతుండడంతో కిలో కొనే వారంతా అరకిలోతో సరిపెడుతున్నారు. మొన్నటి వరకు కిలో రూ.25 నుంచి రూ.30 పలికిన ఉల్లి

చెమటలు పట్టిస్తున్న నిత్యావసర సరకుల ధరలు

ధర ప్రస్తుతం కిలో రూ.70కి చేరింది. క్వింటా ఉల్లిగడ్డలు రూ.4,000 నుంచి రూ.5,500 చేరడంతో అవస్థ పడుతున్నారు. వెల్లుల్లి ధర అమాంతం పెరిగిపోయింది. గతేడాది కిలో రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయించారు. మధ్య మధ్యలో ధరలు తగ్గడంతో కిలో రూ.190 ఆటోల్లో వీధుల వెంట తిరిగి విక్రయించారు. ఈసారి దాదాపు కిలో రూ.390 నుంచి రూ.410కి చేరింది.



మున్నాళ్ల ముచ్చటగానే స్టాల్స్..

ధరల నియంత్రణలో భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్‌లు మున్నాళ్ల ముచ్చటగానే మారాయి. కందిపప్పు, బియ్యం ధరలు పెరగడంతో ప్రభుత్వం తగ్గింపు ధరలకు విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. కొద్ది రోజులు నడిచినా ఆ తర్వాత మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వ చిత్త శుద్ధికి ఇది నిదర్శనం.

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రత్యేక చొరవ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ధరల నియంత్రణ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంది. ఉల్లి ధర పెరిగినప్పుడు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఉల్లిగడ్డలు బాగా పండే ప్రాంతం నుంచి కొనుగోలు చేసి వ్యవసాయం మార్కెట్ యార్డుల్లో విక్రయించింది. రాయితీ పోను మిగిలిన ధర ప్రభుత్వమే చెల్లించేది.

కందిపప్పు... పెసరపప్పు కూడా...

కనీసం పప్పు వండుకుని తిందామన్నా వీలుకాని పరిస్థితి. నిత్యావసర సరకులైన కందిపప్పు, పెసర పప్పు, ఎండు కొబ్బరి, ఎండుమిర్చి ధరలకు రెక్కలు వచ్చాయి. నిత్యం వినియోగించుకునే వాటి ధర పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కందిపప్పు కిలో రూ.150 నుంచి రూ.170కు చేరుకుంది పెసర పప్పు రూ.125, ఎండు కొబ్బరి రూ.210కి చేరింది. ఎండుమిర్చి ధర కిలో రూ.225 నుంచి రూ.250 వరకు ఉండడంతో ప్రజలు కొనలేని పరిస్థితి.

ధరల పెరుగుదల ఇలా...

కందిపప్పు కిలో రూ.173, చింతపండు రూ.140, ఎండుమిర్చి రూ.220, ఉల్లిగడ్డలు రూ.70, గోధుమ పిండి రూ.30 నుంచి రూ.50, బియ్యం రూ.50 నుంచి రూ.80, కోడిగుడ్డు రూ.4.50 నుంచి రూ.6కి చేరింది. ఇవే కాదు వంటలకు వినియోగించే అన్ని

చుక్కలనంటుతున్న కొబ్బరికాయల ధరలు

నిత్యావసర సరకులతోపాటు కొబ్బరికాయలు ధరలు పోటీపడుతున్నాయి. కార్తిక మాసంలో కొబ్బరికాయలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ధరలు పెరగడంతో వ్యాపారులు కొంత కాలంగా విక్రయాలను నిలుపుదల చేశారు. చిన్న కొబ్బరికాయ కూడా రూ.35 నుంచి రూ.40 పలుకుతుండడంతో వాటి విక్రయాల జోలికి వెళ్లడం లేదని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. కొబ్బరికాయల ధరలు చూసి భక్తులు ఖంగుతింటున్నారు.

పోపులు, దినుసులు, ధనియాలు, పసుపు, తదితరాల ధరలు 30 శాతం వరకు పెరిగాయి. ఇవే కాకుండా కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. ఆకుకూరలు మండుతున్నాయి.

గతేడాదికి ... ప్రస్తుత ధరల వ్యత్యాసం (కిలో)...

సరుకు పేరు	2023న ధరలు(రూ.లలో)	2024న ధరలు(రూ.లలో)
వెల్లుల్లి	190.00	410.00
సన్‌ఫ్లవర్	110.00	145.00
పామాయిల్	88.00	140.00
ఎండు కొబ్బరి	120.00	210.00
శనగ విత్తనాలు	82.00	130.00
ధనియాలు	115.00	120.00
అలసందలు	100.00	110.00
కందిపప్పు	150.00	170.00
పెసరపప్పు	105.00	130.00
ఉల్లిగడ్డలు	30.00	70.00
మినపప్పు	95.00	120.00
కొబ్బరికాయలు	20.00	40.00

భారీగా పెరిగిన వంట నూనెల ధరలు

ఇటీవల వంటనూనెలపై కేంద్రం దిగుమతి సుంకాన్ని 20 శాతానికి పెంచింది. వంట నూనెల ధరలు భారీగా పెరిగాయి. 12 శాతం ఉన్న దిగు మతి పన్ను 32 శాతానికి పెంచింది. ఫలితంగా వంట నూనెల లీటర్‌పై రూ.20 వరకు పెరిగింది. మొన్నటిదాకా పామాయిల్ ధర రూ.96 కాగా ఇప్పుడు రూ.120 సన్‌ఫ్లవర్ రూ.115 నుంచి రూ.140, శనగ నూనె రూ.155 నుంచి రూ.170కి చేరింది.

ధరలు మండుతున్నాయి..



కందిపప్పు, పామాయిల్, బియ్యం, మిరపకాయలు, పప్పులు, కొబ్బరి ధరలు మండిపోతున్నాయి. రూ.వెయ్యి తీసుకెళితే ఏమీ రావడం లేదు. సామాన్యుల జీవనం ప్రశ్నార్థకంగా మారింది. ధరల నియంత్రణ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి.
–డి.విజయలక్ష్మి, గృహిణి, సత్తెనపల్లి

జీవనం కష్టమే..



అన్ని సరకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఓ వైపు నిత్యావసర సరకులు .. మరోవైపు కూరగాయలు, ఇంకోవైపు కొబ్బరికాయల ధరలు పెరగడంతో జీవనం కష్టతరంగా మారింది. పేద, మధ్యతరగతి వర్గాలు జీవించటమే కష్టంగా మారుతోంది. ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుంది.
–ఉల్లంఘుల విజయలక్ష్మి, గృహిణి, సత్తెనపల్లి

ఉల్లిగడ్డలంటేనే భయమేస్తోంది



ఇంట్లో ఏ వంట చేయాలన్నా ఉల్లిగడ్డలు, వెల్లుల్లి తప్పనిసరి. వాటి ధర చూసి కొనాలంటేనే భయమేస్తోంది. గతేడాది వెల్లుల్లి కిలో రూ.150 నుంచి రూ.200 లోపే ధర ఉండేది. ఈ ఏడాది కిలో రూ.380 నుంచి రూ.410 వరకు ధర ఉంది. ఇంత ధర పెట్టి వెల్లుల్లి పాయలు కొని తినలేకున్నాం.
–పి.వెంకటలక్ష్మి, గృహిణి, సత్తెనపల్లి

నదిలో స్నానానికి వెళ్లి భార్యాభర్తలు గల్లంతు

- భార్య మృతదేహం లభ్యం
- భర్త ఆచూకీ కోసం గాలింపు



నదిలో గల్లంతైన నీలా సత్యనారాయణ, పద్మావతి

రెంటచింతల: కార్తికమాసం పురస్కరించుకుని మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేసేందుకు వెళ్లిన దంపతులు ముందుగా సమీపంలోని కృష్ణానదిలో స్నానం చేసేందుకు దిగి గల్లంతైన ఘటన శనివారం జరిగింది. రెంటచింతలకు చెందిన నీలా సత్యనారాయణ (60) పద్మావతి(54) దంపతులు ద్విచక్రవాహనంపై సత్రశాల స్వామి దర్శనానికి వెళ్లారు. ముందు పద్మావతి నదిలోకి దిగగా కాలుజారి పడగా వెంటనే భార్యను కాపాడబోయిన సత్యనారాయణ కూడా జారి నదిలో పడిపోయాడు. కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో భార్యాభర్తలు ఇద్దరూ నదిలో మునిగి గల్లంతయ్యారు. సమీపంలో స్నానం చేసేందుకు అక్కడకు వచ్చిన అయప్ప మాలధారులు కొందరు వారిని రక్షించేందుకు విశ్వప్రయత్నం చేశారు. సమాచారం తెలుసుకున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు అధికారులు విద్యుత్ టెయిల్‌పాండ్ నుంచి వస్తున్న నీటిని నదిలోకి రాకుండా నిలిపివేశారు. స్థానిక జాలర్లు కొందరు నదిలో గాలింపు చర్యలు చేపట్టగా పద్మావతి మృతదేహం వెలికితీశారు. సత్యనారాయణ ఆచూకీ కోసం సాయంత్రం వరకు గాలించిన ఫలితం దక్కలేదు. పద్మావతి మృతదేహానికి శవ పంచనామా నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సత్యనారాయణ స్వగ్రామం మండలంలోని తుమ్మకోట. 2017 నుంచి రెంటచింతలలో ఉంటూ అపరాల వ్యాపారం చేస్తుండేవాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.

క్షణికావేశంలో విద్యార్థిని ఆత్మహత్య

- పెన్ను విషయంలో తోటి విద్యార్థులతో వాగ్వివాదం
- కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య
- కళాశాల ఎదుట విద్యార్థిని బంధువుల ఆందోళన



ఆసుపత్రిలో అనూష మృతదేహం

నరసరావుపేట రూరల్: పెన్ను విషయమై తోటి విద్యార్థులతో ఘర్షణ పడి క్షణికావేశంలో కళాశాల భవనం నాల్గవ అంతస్తు నుంచి దూకి ఇంటర్మీడియట్ విద్యార్థిని శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. బొల్లాపల్లి మండలం వెల్లటూరుకు చెందిన జెట్టి అనూష(17) రావిపాడురోడ్డులోని ప్రైవేటు కళాశాల బాలికల క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతుంది. అపార్ట్‌మెంట్‌లో హాస్టల్‌తో పాటు తరగతి గదులను కళాశాల నిర్వహిస్తుంది. మొదటి అంతస్తులో తరగతులు, మిగిలిన మూడు అంతస్తులతో హాస్టల్, సెల్లార్‌లో మెస్ నిర్వహిస్తున్నారు. ఉదయం తరగతులకు హాజరైన అనూష తోటి విద్యార్థులతో కలిసి మెస్‌కు వచ్చింది. అనంతరం ఉదయం 8.30గంటల సయంలో హాస్టల్‌కు వెళ్లిన అనూష నాల్గవ అంతస్తుపై నుంచి కాకతీయనగర్ వైపు దూకింది. పెద్ద శబ్దం రావడంతో విద్యార్థులతో పాటు కళాశాల సిబ్బంది అటువైపు పరుగులు తీశారు. తీవ్ర గాయాలతో ఉన్న అనూషను ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందింది. అనూష మృతి సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు అధిక సంఖ్యలో ఏరియా వైద్యశాలకు వచ్చారు. కుమార్తె మృతదేహాన్ని చూసి అనూష తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కూలీ పని చేసుకునైనా నిన్ను చదివిద్దామనుకుంటే ఇలా ఎలా చేశావమ్మా అంటూ వారు విలపించిన తీరు చూపరులను కన్నీరు పెట్టించింది.

కళాశాల భవనం ఎదుట ఆందోళన

విద్యార్థిని మృతిపై రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ ప్రియాంకలు కళాశాలలో విచారణ చేపట్టారు. డీఐఈవో ఎం.నీలావతిదేవి కళాశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి వివరాలు సేకరించారు. తోటి విద్యార్థులతో పెన్ను విషయంలో జరిగిన స్వల్ప వాగ్వివాదం కారణంగానే అనూష ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. కళాశాల యాజమాన్యం వైఖరికి నిరసనగా అనూష తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. విద్యార్థిని మృతిపై వారు అనుమానాలు వ్యక్తం చేశారు. పెన్ను విషయంలో ఆత్మహత్యకు పాల్పడిందంటూ యాజమాన్యం, అధికారులు ప్రకటించడాన్ని వారు తప్పుబట్టారు. తమ కుమార్తె మృతి చెందితే కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతిపై వాస్తవాలు తెలిసేలా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్‌ఐ ప్రియాంక తెలిపారు.

ప్రతిభాలోత్సవ్!

- తెలుగుపై మమకారాన్ని చాటిన బాలోత్సవ్
- రెండవ రోజూ సందడి చేసిన చిన్నారులు





వేషధారణలో చిన్నారులు



పెదకాకాని: ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్ – 2024 వేడుకల్లో చిన్నారులు రెండవ రోజైన శనివారం కూడా సందడి చేశారు. పద్యపఠనం, ఏకపాత్రాభినయం, శాస్త్రీయ, జానపద నృత్యాలతో వీవీఐటీ కళాశాల పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు తెలుగు భాష, సంస్కృతిపై మమకారాన్ని చాటి చెప్పారు.
మూడు రోజుల బాలోత్సవ్ వేడుక శుక్రవారం ప్రారంభం కాగా... శనివారం కూడా ఆద్యంతం ఉత్సాహంగా కొనసాగింది. పెదకాకాని మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో కొనసాగుతున్న ఈ వేడుకకు సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. దీంతో బాలోత్సవ్ ప్రాంగణం కళకళలాడింది. 230 పాఠశాలల నుంచి 2,500 మంది పోటీల్లో పాల్గొన్నారు. చిన్నారుల జానపద నృత్యాలు, నాటికలు, సంగీతం తదితర అంశాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 250 జానపద నృత్యాలు వేదికల వద్ద సందడిగా సాగాయి. బాలబాలికలు ప్రదర్శించిన 31 నాటికలు చిన్నారులకు సమాజం పట్ల ఉన్న దృక్పథాన్ని చాటాయి. సమాజానికి హితవు పలికేలా సాగుతూ ఆకట్టుకున్నాయి. కథ, కవిత, లేఖా రచనలు, వక్తృత్వ పోటీలు వారిలోని సృజనాత్మకతను వెలికితీశాయి. బాలల అనుభవాలు, ఆలోచనలు నేటి సమాజానికి ఉపయోగపడేలా న్యాయనిర్ణేతలు ప్రత్యేక సూచనలు చేశారు. వాద్య సంగీత పోటీలు ఆకట్టుకున్నాయి. కథా సమాహారం పంచతంత్రం తెలుగు అనువాద గ్రంథం వీవీఐటీ 32వ ప్రచురణను సంస్థ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, కొత్తగూడెం బాలోత్సవ్ సృష్టికర్త డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు, పోటీల విజేతలు ఆవిష్కరించారు.



సత్యభామ వేషధారణలో...



నాటికలోని ఓ సన్నివేశం



గ్లోబ్ నమూనా చేసిన విద్యార్థులతో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

క్లుప్తంగా

రేపటి నుంచి జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లాలో సోమవారం నుంచి అండర్–19 బాల,బాలికల జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని అండర్ –19 ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు బీఆర్ స్టేడియంలో సోమవారం కలరియపట్టు, టంగ్తా మార్షల్ ఆర్ట్స్ అండర్–19 బాల,బాలికల జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయన్నారు. అదేరోజు నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీచ్ వాలీబాల్ జట్ల ఎంపికలు జరుగుతాయన్నారు. ఈనెల23న సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు క్రికెట్ జట్ల ఎంపికలు జరుగుతాయన్నారు.ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2006 జనవరి 01 తర్వాత జన్మించి ఉండాలని, ఆధార్, ప్రిన్సిపల్ ధ్రువీకరణతో టెన్త్‌మార్కుల జాబితాతో హాజరు కావాలని కోరారు.

ఆరు చోరీ కేసుల్లో నిందితులకు జైలు

నరసరావుపేటటౌన్: ఆరు చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి ఆర్.ఆశీర్వాదంపాల్ శనివారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన తమ్మిశెట్టి శివ నాగరాజు, మన్నెం రవిలు వివిధ ప్రాంతాల్లో 16 మోటార్ సైకిళ్లను చోరీ చేశారు. వీటిలో ఐదు మోటార్ సైకిళ్లు నరసరావుపేట మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో, ఒక మోటార్ సైకిల్ రెండో పట్టణం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురయ్యాయి. మోటార్ సైకిల్ యజమానులు ఆయా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నిందితుల వద్ద నుంచి 16 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ఒక్కొక్క కేసులో ఒక్కొక్కరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ శిక్ష మొత్తాన్ని ఏకకాలంలో అనుభవించేలా తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ లక్ష్మీరామ్‌నాయక్ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పోతవరం గ్రామానికి చెందిన జనరేటర్ ఎలక్ట్రీషియన్ షేక్ కాలేషావలి(24) చిలకలూరిపేట పట్టణంలో ఓ దుకాణం పెట్టుకుని పనులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి పనులు ఉండటంతో షాపులోనే ఉండి తెల్లవారుజామున బైక్‌పై పోతవరం వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. వేగం ఎక్కువగా ఉన్నందున కింద పడిన కాలేషాను కొద్దిదూరం ఈడ్చుకు వెళ్లింది. తీవ్రగాయాలైన కాలేషా సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. తల్లి జైనాబీ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీపును ఢీకొన్న ప్రమాదంలో మరొకరు..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా ఒకరు మృతి చెందిన సంఘటన యడవల్లి సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు...యడవల్లి గ్రామానికి చెందిన కోంద్రు వీరాంజనేయులు, ఏసురాజు, ఇశ్రాయేలు బైక్‌పై శుక్రవారం కోటప్పకొండ నుంచి గ్రామానికి బైక్‌పై వస్తున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న జీపును ఢీకొట్టారు. ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఏసురాజు, వీరాంజనేయులుకు స్వల్ప గాయాలు కాగా, కోంద్రు ఇశ్రాయేలు(55)కు తీవ్ర గాయాలయ్యాయి. ఇశ్రాయేలును గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మినీలను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ఆందోళన



కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ నాయకులు

నరసరావుపేట: అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో జారీ చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేసి కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలసి వినతిపత్రం సమర్పించారు. నాయకురాలు మాధవి మాట్లాడుతూ పేద గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ మినీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. సెంటర్ నిర్వహణకు వర్కర్, హెల్పర్ పని ఒకరే చేయటం వలన పనిభారం పెరిగిందన్నారు. మినీ వర్కర్లకు ప్రమోషన్ ఇవ్వాలని జీఓ ఉన్నా సక్రమంగా అమలుకావట్లేదని, అత్యవసర సమయం, వేసవిలో ఎటువంటి సెలవులు ఇవ్వట్లేదన్నారు. పెరుగుతున్న వేతనాలకు అనుగుణంగా జీతాలు పెరగటంలేదని అన్నారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం చేసిన 42 రోజుల సమ్మె సందర్భంగా తెలిపిన అంగీకారం మేరకు సర్వే కూడా చేశారన్నారు. అందువలన మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చి మిగతా సమస్యలను పరిష్కరించాలని కోరారు. బి.నాగేంద్ర, మరియమ్మ, శివచంద్రిక పాల్గొన్నారు.

నడిరోడ్డుపై మహిళల పట్ల అసభ్య ప్రవర్తన

- యువకుడిని పోలీసులకు అప్పగించిన స్థానికులు
- గంజాయి మత్తే కారణమని ప్రజల ఆరోపణలు



నిందితుడు విజయ్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఓ యువకుడు మహిళల పట్ల నడిరోడ్డుపై అసభ్యంగా ప్రవర్తించాడు. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి పోలకంపాడు మూడు బొమ్మల సెంటర్ వద్ద ఈ ఘటన జరిగింది. విజయ్ అనే యువకుడు మొదట రోడ్డు వెంబడి వెళ్లే విద్యార్థినులను వెంబడించగా, వారు భయంతో పారిపోయారు. తర్వాత తనకు ఎదురుగా వస్తున్న మహిళ చేయి పట్టుకుని అతడు లాక్కెళ్లబోయాడు. సదరు మహిళ పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి విజయ్‌ను అడ్డుకున్నారు. తర్వాత తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. స్థానికులు పట్టుకున్న సమయంలో అతడు తన వద్దనున్న గంజాయి పొట్లాన్ని పిచ్చి మొక్కలలోకి విసిరివేశాడని అక్కడున్నవారు తెలిపారు. విజయ్‌ను పోలీసులు విచారిస్తున్నట్లు సీఐ కళ్యాణ్ రాజు తెలిపారు. విజయ్ మద్యంగానీ, గంజాయిగానీ తాగలేదని, మానసిక పరిస్థితి బాగోలేక అలా ప్రవర్తించి ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

సహజీవనం కొనసాగించకుంటే చంపేస్తా

- వివాహితను వేధిస్తున్న ప్రియుడు
- బాధితురాలి తండ్రి గొంతుపై కాలితో తొక్కి దారుణం

తెనాలి రూరల్: తనతో సహజీవనం కొనసాగించకుంటే చంపేస్తానని వివాహితను ప్రియుడు బెదిరిస్తున్నాడు. అంతటితో ఆగకుండా మంచాన పడి ఉన్న ఆమె తండ్రి గొంతుపై కాలితో తొక్కి తన కర్కశాన్ని చాటాడు. ఆమె ఇంట్లోని సామగ్రి విసిరేయడమే కాకుండా దుస్తులనూ తగులబెట్టాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన గురించి బాధిత మహిళ కథనం మేరకు వివరాలు... వేమూరు మండలం చావలి గ్రామానికి చెందిన చావలి శాంతిశ్రీ గతంలో చేబ్రోలు మండలం శేకూరుకు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. విభేదాల కారణంగా భర్తతో విడిపోయింది. ఏడాది క్రితం పట్టణ ఐతానగర్‌కు చెందిన మాతంగి నవీన్ పరిచయమయ్యాడు. కొంత కాలం సహజీవనం చేశారు. నవీన్ తీరు నచ్చక కొన్నాళ్లుగా దూరం పెడుతోంది. మండలంలోని సంగంజాగర్లమూడిలో అద్దె ఇంట్లో ఉంటున్న ఆమెతో అటు మంచానికే పరిమితమైన తండ్రి ఉన్నాడు. కొద్ది రోజుల క్రితం శాంతిశ్రీ లేనప్పుడు ఇంటికి వెళ్లిన నవీన్ ఆమె తండ్రి గొంతుపై కాలు వేసి తొక్కాడు. పైశాచికంగా దాన్ని వీడియో తీసి ఆమెకు పంపాడు. ఇంట్లోని వస్తువులన్నీ విసిరేసి ఆమె దుస్తులను తగులబెట్టాడు. బంధువుల ఇంట్లో తలదాచుకుంటున్న ఆమెకి ఫోన్ చేసి 'ఎక్కడ ఉన్నావో చెప్పు.. వచ్చి చంపేస్తానంటూ' బెదిరిస్తున్నాడు. బాధితురాలు రూరల్ పోలీసులను ఆశ్రయించింది. విషయం తెలుసుకున్న నిందితుడు పరారయ్యాడు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కాకాని శివాలయానికి కార్తిక శోభ

- అధిక సంఖ్యలో తరలి వచ్చి భక్తుల పూజలు
- దీప కాంతులతో కళకళలాడిన శైవక్షేత్రం



ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

పెదకాకాని: శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం కార్తిక మాసం సందర్భంగా భక్తులతో కళకళలాడింది. పెదకాకాని శివాలయంలో శనివారం వేకువజామున సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. యజ్ఞాల బావి వద్ద కార్తిక మాస స్నానాలు చేసిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. శివాలయ ప్రాంగణంలో ఇంటి నుంచి తెచ్చుకున్న పూజా ద్రవ్యాలతో దీపాలు వెలిగించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పొంగళ్లు పొంగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ పర్యవేక్షణలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. స్వామి వారి దర్శనం సకాలంలో జరిగేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో అంతరాలయ దర్శనాలు, అభిషేకాలు, ఏక వారాభిషేక పూజలు, అన్నప్రాసనలు, నామకరణలు, రాహు కేతు పూజలు అధికసంఖ్యలో జరిగాయి. రాత్రి సమయంలో కార్తిక దీప కాంతులతో ఆలయ ప్రాంగణం కళకళలాడుతూ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

కవాతుతో క్రమశిక్షణ



నగరంపాలెం: కవాతుతో క్రమశిక్షణ అలవాటవుతుందని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. పోలీస్ కవాతు మైదానంలో శనివారం పోలీస్ అధికారులు, సిబ్బంది కవాతు నిర్వహించారు. పోలీసుల నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కవాతుతో శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, ఓర్పు అలవాటవుతాయని అన్నారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, కవాతు పరేడ్ కమాండర్ ఆర్ఐ సూర్యభాస్కర్, ఆర్మ్‌డ్ రిజర్వ్, సివిల్ పోలీస్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

అనంతరం పక్కనున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్) కార్యాలయాన్ని ఎస్పీ పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, పోలీస్ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు రోల్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, 17 బాల, బాలికలకు రోల్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక సోమవారం జరగనుంది. ఆ రోజు ఉదయం 9 గంటలకు గుంటూరులోని బీఆర్ స్టేడియంలో ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ కార్యదర్శి మెల్లంపూడి రవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఈ నెల 20న త్రోబాల్ అండర్–14, 17 బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక పెనుమాక జెడ్పీ హైస్కూల్లో ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలవారు 20న ఉదయం 9 గంటలకు సంబంధిత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ బి. రమేష్‌బాబుకు రిపోర్టు చేయాలని సూచించారు.

ఎస్‌ఐ, హోంగార్డులకు ఎస్పీ పరామర్శ



గాయపడి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎస్‌ఐను పరామర్శిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: పోలీసు విధులలో ఉండగా రోడ్డు ప్రమాదానికి గురై హాస్పిటళ్లలో చికిత్స పొందుతున్న నాగార్జునసాగర్ ఎస్ఐ షేక్ మొహమ్మద్ షఫీ, హోంగార్డు నాగెండ్ల బ్రహ్మంలను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. వీరు వెల్దుర్తి వెళ్లి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకొని బలమైన గాయాలయ్యాయి. ఎస్ఐ మాచర్లలోని రవితేజ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా, హోంగార్డు నరసరావుపేట జీబీఆర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయా హాస్పిటళ్లకు వెళ్లిన ఎస్పీ గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. హోంగార్డుకు మెరుగైన చికిత్స ఇప్పించాలని హోంగార్డు ఆర్ఐ కృష్ణను ఆదేశించారు. గురజాల డీఎస్పీ, మాచర్ల రూరల్ సీఐ, ఎస్‌బీ సీఐ బండారు సురేష్‌బాబు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు తరలిస్తున్న ముగ్గురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు: మాదక ద్రవ్యాలను తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో శనివారం మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ ఎ.వి.శివప్రసాద్ వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలానికి చెందిన షేక్ గౌస్‌బాషా అలియాస్ బాషి ప్రస్తుతం యానాదికాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇతనితోపాటు గుంటూరులోని నెహ్రూనగర్‌కు చెందిన పఠాన్ మున్నా, అరుంధతినగర్‌కు చెందిన ముక్కంటి రాము అలియాస్ రవి చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో శనివారం ఏటుకూరు రోడ్డులోని మున్సిపల్ డంపింగ్ యార్డు వద్ద బెంగళూరు నుంచి తీసుకొచ్చిన 15 గ్రాముల మాదక ద్రవ్యం 'మెత్'ను మూడు ప్యాకెట్లు చేసి పంచుకుంటున్న సమయంలో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మెత్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 50వేలకు పైగా ఉంటుందని తెలిపారు. నిందితుల్లో షేక్ గౌస్‌బాషాపై లాలాపేట పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ ఉందని చెప్పారు. గతంలో గంజాయి విక్రయం, ప్రస్తుతం మెత్‌ను బెంగళూరు నుంచి ఇతడే తీసుకొచ్చినట్లు గుర్తించారు. పఠాన్ మున్నాపై కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి కేసు ఉందని వివరించారు. ముక్కంటి రాము అలియాస్ రవిపై పాతగుంటూరు, అరండల్‌పేట పోలీసు స్టేషన్ల పరిధిలో గంజాయి, చోరీ కేసులు ఉన్నట్లు వివరించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన హెడ్‌కానిస్టేబుళ్లు కె.శ్రీనివాసరావు, ఆర్.అనంతకుమార్, కానిస్టేబుల్ పి.కిరణ్, ఎ.రాంబాబు, ఎం.కళ్యాణ్, అప్పలనాయుడు, తిరుమలరావులను డీఎస్పీ అభినందించారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు

ప్రత్తిపాడులో మోహన్ ట్రేడర్స్, మ్యాక్స్ సొసైటీలపై కేసు నమోదు



ప్రత్తిపాడులో ఎరువుల గోడౌన్లలో స్టాక్ నిల్వలను పరిశీలిస్తున్న ఏవో అరుణకుమారి

ప్రత్తిపాడు: ఎరువుల దుకాణాలలో వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారంటూ రైతుల నుంచి ఫిర్యాదులు భారీగా అందుతుండటంతో సోదాలు చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మోహన్ ట్రేడర్స్, మ్యాక్స్ సొసైటీ, సాయిరాం ట్రేడర్స్, అమరలింగేశ్వర ఫెర్టిలైజర్స్‌లో ఏవో కె. అరుణకుమారి శనివారం తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లలో ఉన్న ప్రకారం గోడౌన్లలో సరకును పరిశీలించారు. వివరాల మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో మోహన్ ట్రేడర్స్‌లో రూ. 12,13,920 విలువ చేసే 47.97 మెట్రిక్ టన్నుల ఎరువులు, మ్యాక్స్ సొసైటీలో రూ. 1,18,250 విలువ చేసే 10.75 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్ చేశారు. నిర్వాహకులపై 6ఏ కేసులు నమోదు చేస్తున్నట్లు ఏవో తెలిపారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే ఉపేక్షించబోమని, లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు కచ్చితంగా ఎమ్మార్పీకే కొనుగోలు చేసి, రసీదులు తీసుకోవాలని సూచించారు. ఇబ్బందులు ఎదురైతే నేరుగా తమకు ఫిర్యాదు చేయాలని ఏవో తెలిపారు. మోహన్ ట్రేడర్స్ లైసెన్సును తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు చెప్పారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్న నేపథ్యంలో శుక్రవారం తనిఖీలో సుమారు రూ. 86 లక్షల విలువ చేసే ఎరువుల విక్రయాలను నిలిపివేసి, షాపు లైసెన్స్ నిలిపివేయాలని ఉన్నతాధికారులకు ఏవో సిఫారసు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లైసెన్సును తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. పదిహేను రోజుల్లోగా వివరణ ఇవ్వాలని దుకాణ నిర్వాహకులకు నోటీసులిచ్చామని, వారిచ్చే సమాధానాన్ని బట్టి తదుపరి నిర్ణయం ఉంటుందని తెలిపారు.





షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

తాడికొండ: తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో శనివారం షూటింగ్ బాల్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈ మేరకు పీఈటీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఈ నెల 23, 24, 25 తేదీలలో అనంతపురంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను షూటింగ్ బాల్ కార్యవర్గ సభ్యులు రవిబాబు, సీనియర్ ఉపాధ్యాయులు రమణయ్య, పీఈటీ తదితరులు అభినందించారు. ఉపాధ్యాయులు కిషోర్, నరేష్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.